## హూన్సాలో ఘనంగా హోలీ సంబురాలు

ఉదయం రంగుల సందడి

మధ్యాహ్నం కుస్తీ పోటీలు

సాయంత్రం పిడిగుద్దులాట



బోధన్, బతుకమ్మ: సాలుర మండలం లోని హున్సా గ్రామంలో గత దశాబ్దాలుగా ఆనంద హోలీ సందర్భంగా నిర్వహించే పిడిగుద్దులాట ఈసారి చంద్రగ్రహణం కారణంగా మంగళవారం బదులుగా బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామమంతా పండుగ వాతావరణంలో కళకళలాడింది. ఉదయం గ్రామ ప్రజలందరూ ఉత్సాహంగా రంగులతో హోలీ ఆడుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా యువకులు, మహిళలు, వృద్ధులు పండుగను ఆనందంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం గ్రామంలో సంప్రదాయ కుస్తీ పోటీలను నిర్వహించారు. యువకులు శక్తి ప్రదర్శన చేస్తూ పోటీల్లో పాల్గొనగా, గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై ఉత్సాహపరిచారు. సాయంత్రం గ్రామ నడిబొడ్డులోని హనుమాన్ ఆలయం సమీపంలో పిడిగుద్దులాటను నిర్వహించారు. ప్రత్యేకంగా తాడు కట్టి రెండు బృందాలుగా విడిపోయిన యువకులు ఒక చేత్తో తాడు పట్టుకుని మరో చేత్తో పిడిగుద్దులు కురిపించడం ఈ ఆట ప్రత్యేకతగా నిలిచింది. ఈ సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతుండటం విశేషం. గ్రామంలోని అన్ని కులాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొనడం హోలీ ఉత్సవాలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సంప్రదాయం, ఐక్యత, ఉత్సాహం కలగలిపిన హున్సా హోలీ వేడుకలు గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపాయి.



## ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రశాంతం

369 మంది విద్యార్థులు గైర్హాజరు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :ఇంటర్ పరీక్షలు బుధవారం రెండవ సంవత్సరం మ్యాథ్స్–2 ఎ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, 97.8 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ తెలియజేశారు. మొత్తం 16,899 మంది విద్యార్థులకు గాను 16,530 మంది హాజరయ్యారని, 369 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజర్ అయ్యారని తెలిపారు. జనరల్ లో మొత్తం 14,488 మంది విద్యార్థులకు గాను 14,185 మంది, ఒకేషనల్ లో 2,411 మంది విద్యార్థులకు గాను 2,345 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలియజేశారు. జిల్లాలో మొత్తం 58 పరీక్షా కేంద్రాలలో 54 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని ఆయన పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఇంటర్ విద్యా కన్వీనర్ 8 పరీక్ష కేంద్రాలు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 12, హై పవర్ కమిటీ 6, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లు మొత్తం 28 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షించారని తెలియజేశారు. అలాగే బోర్డు స్క్వాడ్ బృందం కూడా పలు కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు. అలాగే బుధవారం పరీక్షా ప్రశ్న పత్రాలను నిక్షిప్తం చేసిన డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ లో ప్రశ్న పత్రాల ప్యాకెట్ల పంపిణీ, సమయపాలన పైన కూడా ఇంటర్ బోర్డు పర్యవేక్షకులు తనిఖీ చేసి సమీక్షించారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు.

## ఘనంగా విద్యుత్ లైన్‌మ్యాన్ దివాస్ వేడుకలు



బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో ఏఈ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో లైన్‌మ్యాన్ దివాస్ వేడుకలను బుధ వారం ఘనంగా నిర్వహిం చారు. విద్యుత్ రంగంలో ప్రాణాలకు తెగించి నిరం తరం సేవలు అందిస్తున్న ఫ్రంట్‌లైన్ యోధులైన లైన్‌మెన్‌ల సేవలను గుర్తించి వారిని గౌరవించడం లైన్‌మ్యాన్ దివాస్ ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా ఏఈ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి లైన్‌మ్యాన్ నిత్యం భద్రతా పరికరాలు ఉపయోగించుకుంటూ సురక్షితంగా పని చేయాలని సూచించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు లైన్‌మెన్ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతరం పలువురు విద్యుత్ ఉద్యోగులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపవాసంతో నియమం, సహనం, క్రమశిక్షణ పెంపొందుతాయి

### బోధన్ ఇఫ్తార్ విందులో పోలీస్ కమీషనర్ సాయి చైతన్య





బోధన్, బతుకమ్మ : రంజాన్ ఉపవాసం ద్వారా నియమం, సహనం, క్రమశిక్షణ పెంపొందుతాయని, పేదల పట్ల కరుణాభావం మరింత బలపడుతుందని పోలీస్ కమీషనర్ సాయి చైతన్య అన్నారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ జామ మసీద్‌లో మజీద్ కమిటీ అధ్యక్షుడు గుల్షని ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముక్తి జావేద్ నిర్వహించిన దువాలో సీపీ పాల్గొని, అనంతరం ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రంజాన్ మాసం విశిష్టతను విశ్లేషణాత్మకంగా వివరించారు. రంజాన్ అనేది కేవలం ఉపవాసాల నెల మాత్రమే కాకుండా, మనస్సును పరిశుభ్రం చేసుకునే ఆత్మపరిశీలన కాలమని అన్నారు. దానధర్మాలు, సహనశీలత, సోదరభావం వంటి విలువలు ఈ పవిత్ర మాసంలో మరింత ఆవిష్కృతమవుతాయని చెప్పారు. అల్లా కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. అలాగే అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి బోధన్‌కు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎసిపి శ్రీనివాస్, సీఐలు వెంకటనారాయణ, విజయబాబు, కృష్ణ , ఎస్సై హబీబ్, మజీద్ కమిటీ సభ్యులు మహబూబ్ గుల్ షాని, సయ్యద్ జాకీర్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. సీపీ హాజరుకావడం పట్ల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## అనారోగ్యంతో భార్య మృతి దుబాయ్‌లో ఉన్న భర్త

బతుకమ్మ మెండోర్:మెండోర మండలం సావెల్ గ్రామానికి చెందిన నూకల లక్ష్మి నర్సు అనారోగ్యంతో మృతి చెందింది. భర్త నూకల లింబద్రీ బ్రతుకుదేరువు కోసం దుబాయ్ వెళ్ళడు. తన భార్య కడసారి చూపు కోసం ఇండియా రావటానికి ఎన్నో ప్రయత్నాలు చేసినా గల్ఫ్ లో జరుగుతున్న యుద్ధం కారణం వల్ల ఫ్లైట్ లు రాకపోకలు నిపివేయటం వల్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని మా నాన్నని ఇండియా కి రాప్పించాలని కుమారుడు కోరుతున్నాడు.

## మహిళల హక్కుల కోసం ఉద్యమాలు నిర్మిద్దాం

### ప్రగతి శీల మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి గొంట్యాల సంజన

### మార్చి 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళల హక్కుల కోసం ఉద్యమాలు నిర్మిద్దామని ప్రగతిశీల మహిళా సంఘం నగర ప్రధాన కార్యదర్శి గొంట్యాల సంజన అన్నా రు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రా మిక మహిళల ఉపాధి పై దాడికి వ్యతిరేకంగా అంతర్జా తీయ మహి ళా దినోత్సవాన్ని మార్చి 8న నగ రంలోని నీలం రామచం ద్రయ్య భవన్ లో నిర్వహిస్తున్నట్టు ప్రగ తిశీల మహిళా సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు నీలం లక్ష్మి, గొంట్యాల సంజన తెలిపారు. ప్రగతిశీల మహిళా సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోచమ్మ గల్లీలో అంతర్జా తీయ మహిళా దినోత్సవం వాల్ పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచి నూతన పథకం తేవడం ద్వారా పని కల్పించే బాధ్యత నుండి తప్పుకోవాలని నిర్ణయించు కుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాను 60 శాతానికి తగ్గించుకొని పేద మహిళలకు పని కల్పించకుండా చట్టాన్ని తయారు చేసిందనన్నారు. మహిళల ఉపాధి అవకాశాలను దెబ్బతీసే నూతన పథకాన్ని రద్దు చేసి పాత పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఇచ్చిన మహిళల జీవన భృతిని, ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి మిగతా హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేం ద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ నాయకులు జమున, రాధా, నర్సు బాయి, కళావతి, పోచమ్మ గల్లీ కాలనీవాసులు పాల్గొన్నారు.

## విద్యార్థి కన్నీటి విలువ తెలిసే వరకు మా పోరాటం ఆగదు

### బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పానుగంటి సతీష్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : జిల్లాలోని ఇందల్వాయి మండలం, మాక్లూర్ తండాలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి ఉరి వేసుకుని మృతి చెందడం పై బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పాను గంటి సతీష్ రెడ్డి మాట్లాడు తూ విద్యార్థి ఉరివేసుకొని మృతి చెంద డం అత్యంత విషాదకరమని, ఈ ఘటన జిల్లా ప్రజలను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ దుర్ఘటనకు పాఠశాల ప్రిన్సిపాల్, కొంతమంది ఉపాధ్యాయుల మానసిక ఒత్తిడి కారణమని తోటి విద్యార్థులు వెల్లడించడం చాలా ఆందోళన కలిగించే అంశమన్నారు. విద్యా ర్థులకు మార్గదర్శకులుగా ఉండాల్సిన వారు ఒత్తిడి తీసుకు రావడం వల్ల ఒక చిన్నారి ప్రాణా లు కోల్పోవడం విద్యా వ్యవస్థపై పెద్ద ప్రశ్నార్థక చిహ్నం వేస్తోంద న్నారు. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే నిష్పక్ష పాత విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సతీష్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి అమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థి మృతి చాలా బాధాకరమన్నారు. జిల్లాలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుందని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అతని మృతికి కారణమైన ఉపాధ్యాయుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాల న్నారు. ఒకవేళ చర్యలు తీసుకోక పోతే జిల్లా వ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసన లు చేపడతామని హెచ్చరించారు.



బాధిత కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడతామని స్పష్టం చేశారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని వ్యక్తి మృతి



నందిపేట్, బతుకమ్మ:నందిపేట్ మండల కేంద్రం లో బుధవారం మధ్యాహ్నం విషాదం చోటు చేసుకుంది. మెండోరా మండలం కోడిచర్ల గ్రామానికి చెందిన పెంట సాయన్న మారంపల్లి లో గురువారం జరగబోయే నిశ్చితార్థానికి హాజరయ్యేందుకు వస్తున్నాడు. అదే సమయంలో నందిపేట్ మండల్ వన్నెల్ నుండి మగ్గిడి వెళ్లే బైపాస్ రోడ్డులో వేగంగా స్ప్లెండర్ బైక్ పై మద్యం సేవించి ఎదురుగా వస్తున్నా బైక్ ను ఢీ కొనడం తో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనాన్ని నిర్లక్ష్యం గా నడిపిన నిందితుడు సందీప్ వన్నెల్ కే గ్రామం లో ఇటుక బట్టిలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ శ్యామ్ రాజు తెలిపారు.